క్లుప్తంగా

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు


చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యల్లనూరు: చంద్రబాబు మాటలు నమ్మి ప్రజలు మోస పోవద్దని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివశంకర్ అన్నారు. శనివారం చంద్రబాబు మేనిఫెస్టో రీకాల్ కార్యక్రమం మండలంలోని గొడ్డుమర్రి, లక్షుంపల్లి, సింగవరం, కల్లూరు, కొత్తపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణునారాయణ, ప్రచార కమిటీ మాజీ అధ్యక్షుడు గొడ్డుమూర్తి, ఈశ్వర్ రెడ్డి, సింగవరం సర్పంచు జమాల్, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, సూరి, గొడ్డుమర్రి రామాంజనేయులు, లక్షుంపల్లి మల్లారెడ్డి, సింగవరం చంద్రశేఖర్‌నాయుడు, షెక్షావలి, కుళ్లాయప్ప, బాల నరసింహులు, నాగరంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల క్రాస్‌లో అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

శింగనమల: శింగనమల రంగరాయుల చెరువు మరువకొమ్మ క్రాస్ వద్ద రుష్యశృంగుడు, శ్రీరంగరాయులు విగ్రహాల ఏర్పాటులో భాగంగా శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విగ్రహాలు ఏర్పాటు చేయు స్థలంలో కమిటీ సభ్యులు పూజలు చేశారు. విగ్రహాలు ఏర్పాటు చేయడానికీ నిర్ణయించామని, దాతలు సహకరించాలని వారు కోరారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో శనివారం బంజారాలు తీజ్ (బతుకమ్మ) ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాడి కృష్ణానాయక్, గణపతిస్వామి ఆధ్వర్యంలో భాగ్యనగర్‌లోని శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో జరుపుకునే తీజ్ ఉత్సవం సందర్భంగా యువతులు తొమ్మిది రోజుల పాటు నిష్టతో ఉపవాస దీక్షలు చేపట్టారు. మహిళలు, యువతుల ఆటపాటలు, నృత్యాలు, డప్పుల దరువు మధ్య భక్తిభావంతో ఉత్సవాలు ముగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, కార్యదర్శి రూప్లానాయక్, కోశాధికారి రామునాయక్, కమిటీపెద్దలు బీక్యానాయక్, సోమానాయక్, రమణ, బాలునాయక్, బొజ్జానాయక్, రామ్లానాయక్ పాల్గొన్నారు.

'ఒరిజినల్ ఆధార్ ఉంటేనే ఉచిత బస్సు ప్రయాణం'

గుత్తి: ఒరిజినల్ ఆధార్, పాన్, ఓటరు కార్డులు ఉంటేనే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందని కండక్టర్ నటరాజ్ అన్నారు. గుత్తిలో శనివారం ఆయన మాట్లాడారు. కొందరు మహిళలు సెల్‌ఫోన్‌లో ప్రూఫ్స్ చూపిస్తున్నారని, అలా అయితే ఉచిత ప్రయాణానికి అనర్హులన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆధార్, ఓటరు, పాన్ కార్డులు ఉంటే చాలని చెప్పారని, ఒరిజినల్ కార్డులు ఉండాలని ఎవరూ చెప్పలేదని మహిళలు వాపోయారు. అయితే డ్రైవర్లు, కండక్టర్లు మాత్రం కచ్చితంగా ఒరిజినల్ కార్డులు ఉండాలని చెబుతున్నారు. దీంతో మహిళా ప్రయాణికులు ఉచిత ప్రయాణానికి ఇబ్బందులకు గురయ్యారు.

అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు


మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: గత కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. టూటౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు శనివారం ఆస్పత్రి మార్చురీలోని మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆ నలుగురు సేవాసమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు శ్రీధర్‌రెడ్డి, రవీంద్ర, లింగ, వంశీ, బాబు, రత్న, ఆటో వేణు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు గుంతలమయం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


గుత్తిలో అధ్వానంగా మారిన రోడ్డు


వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న దృశ్యం


గుత్తి ఆర్‌ఎస్ రోడ్డుపై గుంతలు ఉన్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్ రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుత్తిలోని ప్రభుత్వాస్పత్రి సమీపం నుంచి రైల్వే బ్రిడ్జి వరకూ రోడ్డు చాలా అధ్వానంగా మారింది. రద్దీగా ఉండే రహదారి గుంతలమయమవడంతో వాహనదారులతో పాటు ప్రజలు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం వచ్చిందంటే రోడ్డు మరింత దారుణంగా మారుతుంది. పెద్ద వాహనాలు వచ్చిన సమయంలో రోడ్డులో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ధర్నాలు, ఆందోళనలు, నిరసనలు జరిగే సమయాల్లో రోడ్డులో పూర్తిగా ట్రాఫిక్ స్తంభిస్తుంది. కనీసం పాదచారులు నడవటానికి కూడా వీలు లేనంత అధ్వానంగా మారింది. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అధికారులు ఎవరూ స్పందించడం లేదు. కనీసం రోడ్డుకు మరమ్మతులు కూడా చేయించలేదు. రోడ్డు దుస్థితి గురించి మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాను 'సాక్షి' ప్రశ్నించగా త్వరలోనే రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తామన్నారు. రోడ్డు దుస్థితి గురించి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో పాటు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి నూతన రోడ్డు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రాత్రి 7 దాటితే ఆస్పత్రికి తాళం!



ఎద్దులపల్లి పీహెచ్‌సీ గేటు మూసివేసిన దృశ్యం

- ఎద్దులపల్లి పీహెచ్‌సీ సిబ్బంది నిర్వాకం
- ప్రైవేటు ఆస్పత్రులకు పరుగుతీస్తున్న గ్రామీణులు

పామిడి: ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి 24 గంటలు వైద్య సేవలు అందించాల్సి ఉంది. కానీ వైద్య సిబ్బంది 8 గంటలు వైద్యసేవలు అందించడమే గగనమవుతోంది. రాత్రి ఏడు దాటితే ఆస్పత్రికి తాళం వేస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే గ్రామీణులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదీ మండలంలోని ఎద్దులపల్లి గ్రామ పీహెచ్‌సీ దుస్థితి. ఈ ఆస్పత్రికి ఎద్దులపల్లి పరిసర ప్రాంత పరిధిలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య కోసం వస్తుంటారు. వైద్యం కోసం వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాల్సి ఉంది. రాత్రి ఏడుగంటలైందంటే ఆస్పత్రి గేట్లకు తాళాలు పడతాయి. ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది.. తలుపులు వేసుకొని లోపలే ఉండిపోతున్నారు. రాత్రివేళ వైద్యం కోసం వచ్చే గ్రామీణులు ఎంత పిలిచినా...ఆస్పత్రి తలుపులు తెరచుకోకపోవడంతో గత్యంతరం లేక పామిడిలోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని గ్రామీణ ప్రాంత ప్రజలు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఈ విషయంపై ఆ ఆస్పత్రి వైద్యాధికారికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి రాత్రివేళ ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శిస్తూ ప్రజలకు ఎల్లవేళలా వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈకి సన్మానం


డీఈఈ పద్మనాభ పిళ్లైను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ పద్మనాభ పిళ్లైను విద్యుత్ అధికారులు, సిబ్బంది శనివారం సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని గుత్తి ఏపీఎస్‌పీడీసీఎల్ డివిజన్ బెస్ట్ డివిజన్‌గా ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 15న బెస్ట్ డివిజన్ అవార్డును సీఎండీ సంతోష్ రావు చేతుల మీదుగా తిరుపతిలో ఆయన అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురష్కరించుకుని డీఈఈని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఈ సాయి శంకర్, ఏఈలు నాగేంద్ర బాబు, మధుసూదన్, అసిస్టెంట్ ఇంజినీర్లు రామానుజన్ రెడ్డి, సత్యనారాయణ, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు త్రివేణి, ఏఎన్‌ఎం జ్యోతిని ఆస్పత్రి సిబ్బంది శనివారం సత్కరించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో కలెక్టర్ చేతుల మీదుగా వారు శుక్రవారం ఉత్తమ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వారిని సన్మానించారు.

స్వర కోకిలకు ఘన సత్కారం


స్వర కోకిల బిరుదు గ్రహీత వీరలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఏడీఆర్‌ఎం, డీఆర్వోలు

గుంతకల్లు: స్వర కోకిల బిరుదు దక్కించుకున్న సింగర్ బాలాంత్రపు వీరలక్ష్మిని పట్టణ పద్మశ్రీ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల హైదరాబాద్‌లో తాగ్యరాయ గానసభ కార్యక్రమంలో భాగంగా భలే మంచి రోజు అనే సంగీత విభావరి నిర్వహించారు. ఈ సంగీత విభావరిలో గుంతకల్లుకు చెందిన బాలాంత్రపు వీరలక్ష్మి పాల్గొని దాదాపు 38 పాటలు పాడింది. ఆమె గాన కౌశల్యానికి గుర్తింపుగా ఘంటసాల-పి.సుశీల సంగీత పురష్కారం(2025)లో స్వర కోకిల బిరుదును ఆమెకు అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం స్వర కోకిల బిరుదు గ్రహీతకు ఆత్మీయ సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏడీఆర్‌ఎం యు.సుధాకర్, డీఆర్వో ఏ.మలోల హాజరై వీరలక్ష్మి, ఆమె భర్త గోకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరలక్ష్మికి దేవుడు ఇచ్చిన వరం ఆమె స్వరమే అన్నారు. ఆమె ఆలపిస్తున్న గీతాలు ద్వారా మరింత పేరు ప్రతిష్టలతో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మల్లికార్జున, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'శ్రావణ' పూజలు


బీకేఎస్: అలంకరణలో కొండమీద రాయుడు


గుంతకల్లు: శ్రీవారికి పూజలు చేస్తున్న దృశ్యం


గుంతకల్లు: వ్రతంలో పాల్గొన్న మహిళలు

గుంతకల్లుటౌన్: శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారితో పాటు వినాయకస్వామి, గోదాదేవి, పద్మావతి అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తాదులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ వేదపండితుల చేత నిర్వహించిన శ్రావణమాస వ్రతంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రముఖ ఆలయాల్లో శ్రావణమాసం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న దేవరకొండపై వెలసిన కొండమీద రాయుని దేవాలయంలో శనివారం పూజలు చేశారు. భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కొండ క్రింద ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ముసలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

గార్లదిన్నె: శ్రావణ మాసంలో నాగుల చవితి పురస్కరించుకుని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శనివారం వేకువజామున నుంచి మహిళలు భక్తి,శ్రద్ధలతో ఉపవాసాలు ఉండి, సమీపంలో ఉన్న నాగుల కట్ట, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద పుట్టకు, స్వామికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

గుంతకల్లు: పట్టణ ఈడిగ సంఘం ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత గౌతు లక్ష్మన్న చిత్రపటానికి ఈడిగ సంఘం నాయకులుతో కలిసి జితేంద్రగౌడ్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు తరువాత గౌతు లచ్చన్నకు మాత్రమే సర్దార్ అనే బిరుదు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు సంఘం నాయకులు ఆర్.పవన్‌గౌడ్, ఆర్.అనిల్‌గౌడ్, రిటైర్డు తహసీల్దార్ ఈఓ రాముడు, చలపతి, రవిశంకర్, శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ బాలుర వసతి గృహం తనిఖీ

గుత్తి: పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శనివారం గుంతకల్లు డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్, సాకే గోవిందు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వార్డెన్, సిబ్బంది ఒక్కరూ లేరు. హాస్టల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. అయితే వారు అందుబాటులోకి రాలేదు. వార్డెన్ బాషాకు కాల్ చేశారు. తాను లీవ్‌లో ఉన్నానని, పామిడి వార్డెన్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు అధికారులు, వార్డెన్ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్లో సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

దుకాణంలో నగదు చోరీ

పుట్లూరు: మండలకేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలోని ఉన్న దుకాణంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి పుట్లూరులో జనరల్‌స్టోర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వెనుక రేకులకు ఏర్పాటు చేసిన బోల్టులను కత్తిరించి దుకాణంలోకి చొరబడి రూ.15వేలు నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీంతో తనిఖీ చేయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బ్యాంకు సమీపంలో చోరీ జరగడం గ్రామస్తులను భయాదోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే కందికాపుల, కొమటికుంట్ల, గ్రామాల్లో చైన్ స్నాచింగ్ కేసులు నమోదు కావడం, పొలాల్లో కేబుల్ తరచూ చోరీకి గురవుతున్నాయి. పోలీసులు చోరీల నివారణకు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీసు జీపును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గుత్తి: పోలీసు జీపును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన గుత్తిలో చోటు చేసుకుంది. శనివారం సీఐ వెంకటేశ్వర్లు పోలీసు సిబ్బందితో కలిసి గాంధీ సర్కిల్ వద్దకు జీపులో చేరుకున్నారు. రోడ్డు పక్కన జీపు పార్క్ చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ యూటర్న్ తీసుకునే క్రమంలో జీపును ఢీకొన్నాడు. జీపు పాక్షికంగా దెబ్బతింది. జీపులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పెన్నా బ్రిడ్జి సమీపంలోని సపోట తోటలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ 1.02 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఓబులేసు

గుత్తి: గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా జనసేన పార్టీ నాయకుడు ఓబులేసును నియమించారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు


తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో వేకువజాము నుంచి శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. రాధ, కృష్ణ వేషధారణలతో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయా గ్రామాల్లో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు కోలాటాలు, చక్క భజనలు చేశారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు


పెద్దపప్పూరు: అలంకరణలో బాలకృష్ణుడు


గుంతకల్లులోని కృష్ణ ఆలయంలో మూలవిరాట్


గుత్తి రూరల్: కొత్తపేటలో శ్రీకృష్ణుడు


పామిడిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం


గుంతకల్లు: తిమ్మాపురంలో కావేటి వేణుగోపాల్ స్వామి

గుంతకల్లు: పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణ దేవాలయంలో పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీలలిత నాట్యాలయ వ్యవస్థాపకురాలు లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరతనాట్యం, శాస్త్రీయ సంగీత ప్రదర్శన ఎంతోగానో ఆకట్టుకుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరై ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కారించి జ్ఞాపికలను అందజేశారు. సాయంత్రం ఉట్టి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ యాదవ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఎస్.తిమ్మాపురంలో వెలిసిన కావేటి వేణుగోపాల్ స్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గుత్తి: గుత్తిలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.యాదవ సంఘం ఆధ్వర్యంలో మన్రో సత్రం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ర్యాలీని ప్రారంభించారు. గుత్తిలోని పలు ఆలయాలతో పాటు ఆర్‌ఎస్, ఎస్ఎస్ పల్లిలోని శ్రీకృష్ణుని ఆలయాల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేటలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి శ్రీ కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు

పామిడి: పట్టణంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక పామిడి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు సూర్యనారాయణ, శివారెడ్డి. చంద్రశేఖర్ శ్రేష్టి, నారపరెడ్డి, వెంకటేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం మండల కేంద్రం పెద్దపప్పూరుతోపాటు మండలంలోని నరసాపునం,శింగనగుట్టపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భజన బృందం సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

యాడికి: మండల కేంద్రంతో పాటు కొట్టాలపల్లెలో కృష్ణాష్టమి వేడుకలను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆలయం ఆవరణలో భజన కార్యక్రమం నిర్వహించారు. వేములపాడు సర్పంచు ఓంకారమ్మ, ఆలయ కమిటీ ధర్మకర్త శ్రీనివాసయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. అలాగే సంజీవపురంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు.

పెద్దవడుగూరు: మండలంలోని ఏ.తిమ్మాపురం, పెద్దవడుగూరు గ్రామాల్లో శ్రీకృష్ణుని చిత్ర పటాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని యాదవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శింగనమల: శింగనమలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రామాలయం నుంచి శ్రీకృషుడి విగ్రహాన్ని గొల్ల వీధి వరకు ఊరెగింపు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యాదవ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రెడ్డివారిపాలెంలో ఉన్న రాధాక్రిష్ణస్వామి దేవాలయంలో అర్చకులు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాధాకృష్ణులను దర్శించుకుని, పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.


శింగనమలలో శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో చిన్నారులు


యాడికి మండలం కొట్టాలపల్లెలో రాధాకృష్ణులకు పూజలు చేస్తున్న దృశ్యం


గుత్తిలో భక్తుల కోలాటం


గార్లదిన్నె: కల్లూరులో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహం